సాక్షి
ఖమ్మం
మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



తెలంగాణ తెలుగు.. వెలుగు!
తెలుగు ప్రత్యేకతలు, ఉమ్మడి జిల్లాలో కలగలిపి ఉండే మాండలికాలపై నేడు 'తెలంగాణ భాష దినోత్సవం' సందర్భంగా కథనం. 8లో



తీరని యూరియా కష్టాలు
పీఏసీఎస్‌లకు తోడు అదనపు సెంటర్లు ఏర్పాటుచేసినా సరిపడా యూరియా లభ్యత లేక రైతుల ఇక్కట్లు తీరడంలేదు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 24°
వాతావరణం
జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మంగళవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఎర్రుపాలెం, పెద్దగోపవరం, బుచ్చిరెడ్డిపాలెం, బనిగండ్లపాడు, అయ్యవారిగూడెంలో నిర్మించే రహదారులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే, బీమవరంలో రూ.12లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజకవర్గంలో మంగళవారం పర్యటించనున్నారు. ఉదయం 10–30 గంటలకు కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించనున్న మంత్రి, ఆతర్వాత నరసింహులగూడెం, కిష్టాపురం గ్రామంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో గీతకార్మికులకు కాటమయ్య కిట్లు, కూసుమంచి మండల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, పాలేరు నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తారు. అలాగే, సాయంత్రం జుజ్జులరావుపేట, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి పెద్ద తండాలో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశాక ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందచేయనున్నారు. అనంతరం మంత్రి తెల్దారుపల్లిలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ దీక్షారైనా

ఖమ్మం సహకారనగర్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు సజావుగా జరిగేలా అందరూ సహకరించాలని జెడ్పీ సీఈఓ దీక్షారైనా సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆమె వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఇటీవల విడుదల చేసిన ఓటర్ల ముసాయిదా జాబితాపై చర్చించి అభ్యంతరాలను స్వీకరించాక సీఈఓ మాట్లాడారు. అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించాక తుదిజాబితా విడుదల చేస్తామని తెలిపారు.

చేపి పిల్లల టెండర్ల గడువు మళ్లీ పొడిగింపు

ఖమ్మంవ్యవసాయం: చేపపిల్లల పంపిణీకి ఆశించిన స్థాయిలో టెండర్లు రాకపోవడంతో దరఖాస్తు గడువును ప్రభుత్వం మరోమారు పొడిగించింది. మత్స్యశాఖ ఆధ్వర్యాన ఆగస్టు 8న నోటిఫికేషన్ జారీ చేసి తొలుత సెప్టెంబర్ 1 వరకు గడువు విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 25 టెండర్లే రావడంతో ఈనెల 8వరకు గడువు విధించారు. అయినా ఫలితం లేక 12వ తేదీ వరకు గడువు పొడిగించారు. జిల్లాలో 3.49 కోట్ల చేప పిల్లల పంపిణీకి తొలుత ముగ్గురు, రెండో విడతలో ఇంకో కాంట్రాక్టరు టెండర్లు దాఖలు చేశారని జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు.


జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లి కేంద్రియ విద్యాలయం విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో సత్తా చాటారు. పంజాబ్, బెంగళూరు, హైదరాబాద్ రీజియన్లలో నిర్వహించిన పోటీల్లో 48మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రెండేసి బంగారు, రజత పతకాలతో పాటు నాలుగు కాంస్య పతకాలు, రూ.44వేల నగదు బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ కవీంద్రరాయ్ తెలిపారు.

బోధన ఎలా సాగుతోంది?

బోనకల్: మండలంలోని రావినూతల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సోమవారం గురుకులాల ఆర్‌సీఓ రాంబాబు తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఆయన బోధన, మెనూ అమలుపై ఆరా తీశారు. ఆతర్వాత పాఠశాలలో మౌలిక వసతులు, డైనింగ్ హాల్, సామగ్రిని పరిశీలించి సూచనలు చేశారు. అయితే, తరగతి గదుల కొరత ఉండడమేకాక డైనింగ్ హాల్ సరిపోక ఆరుబయటే భోజనాలు చేయాల్సి వస్తోందని ఆయనకు వివరించారు. దీంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆర్‌సీఓ తెలిపారు.

కేంద్రం దయ.. మన ప్రాప్తం



గతేడాది వరదలపై సర్వేతోనే సరి
- అన్నదాతలకు చిల్లిగవ్వా అందని సాయం
- భద్రాద్రి జిల్లాకు ధనధాన్య యోజనలో రిక్తహస్తం
- 'గూడెం'లో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుపైనా అదే తీరు..
- సరిపడా ఎరువుల సరఫరా లేక ఇక్కట్లు







సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలో కేంద్రం చేయూతతో జరగాల్సిన పనుల్లో ముందడుగు పడడం లేదు. గత ఏడాది భారీ వరదలతో ఉమ్మడి జిల్లాలో పంటలకు అపార నష్టం వాటిల్లింది. రూ.వందల కోట్ల మేర రైతులు నష్టపోయి ఏడాది దాటినా సర్వేతోనే సరిపెట్టారు తప్ప రూపాయి సాయం కూడా ఇవ్వలేదు. అలాగే కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు, క్రూడ్ పామాయిల్‌పై సుంకాల తగ్గింపు, ధన ధాన్య యోజనలో భద్రాద్రి జిల్లాకు స్థానం, రఘునాథపాలెం మండలంలో ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటుకు నిధులు, సరిపడా యూరియా కేటాయింపులోనూ రిక్తహస్తమే ఎదురవుతోంది. ఈ అంశాలపై ఇటీవల ఢిల్లీ పర్యటనలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

యూరియా మంటలు
కేంద్రం నుంచి తగిన రీతిలో యూరియా సరఫరా కాక కొరత ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ చూసినా పంపిణీ కేంద్రాల వద్ద బారులు దీరిన రైతులే కనిపిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 54,825 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే 27,865 మెట్రిక్ టన్నులు పంపాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులోనూ 22,653 మెట్రిక్ టన్నులే చేరింది. సెప్టెంబర్‌కు సంబంధించి 5,212 మెట్రిక్ టన్నుల కోటా రావాలి. భద్రాద్రి జిల్లాకు ఈ నెలలో 10,014 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా 2,600 మెట్రిక్ టన్నులు చేరడంతో కొరత ఎదురవుతోంది. ఇంకా 6,677 మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. ఈ క్రమాన మంత్రి తుమ్మల ఇటీవల కేంద్ర మంత్రులను కలిసి సరిపడా యూరియా కేటాయించాలని, నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం, సల్ఫర్‌పై ఇచ్చే రాయితీలు పెంచాలని కోరారు.

ఎస్టీపీకి నిధులివ్వరూ..
రఘునాథపాలెం బ్లాక్‌లోని గిరిజన తండాల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు రూ.110 కోట్ల అంచనా వ్యయంతో సిమెంట్ కాంక్రీట్ డ్రెయినేజీ నెట్‌వర్క్ కోసం డీపీఆర్ సిద్ధం చేశారు. వ్యర్థ జలాలను శుద్ధి చేసి మున్నేటికి వదిలేలా ప్రాజెక్టును రూపొందించారు. దీనికి ఆమోదం లభిస్తే రఘునాథపాలెంలోని 37 ఆవాసాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడనున్నందున గ్రామీణ రహదారి కనెక్టివిటీ ప్రోగ్రామ్ కింద కేంద్రం ఆమోదించాలని ప్రతిపాదించారు.

ఎయిర్‌పోర్ట్‌పై మరోసారి..
కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేశాక ప్రతిపాదిత ప్రాంతం ఆచరణీయం కాదని తేల్చారు. కానీ భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయానికి భక్తులు, కొత్తగూడెంలోని పరిశ్రమలకు వచ్చివెళ్లే వారి కోసం ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు తప్పనిసరి. ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి, మరోసారి అధ్యయనం చేశాకే విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు పడనున్నందున కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు.

ఆయిల్‌పామ్ రైతులకు ఎదురుదెబ్బ
ఉమ్మడి జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా ఆయిల్‌పామ్ సాగవుతోంది. ఈ క్రమాన కేంద్రం పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుంచి 16.5 శాతానికి తగ్గించింది. గతంలో దిగుమతి సుంకం దాదాపు 44 శాతం ఉండడంతో రైతులకు గిట్టుబాటు ధర దక్కింది. కానీ ఇప్పుడు సుంకం తగ్గించడంతో రైతులపై ప్రభావం పడనుంది. రైతులను ఆదుకునేలా కేంద్రం స్పందించి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల్సి ఉంది.

భద్రాద్రి జిల్లాకు అర్హత లేదా?
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్ని రకాల పంటలు కలిపి 7లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. ఈ జిల్లా అంతా ఏజెన్సీ, దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో వర్షాధారంగానే సాగు చేస్తారు. చెరువులు, ఇతర నీటి వనరుల ఆధారంగా వరి, తరి పంటలను సాగు చేస్తున్నారు. ఈ వానాకాలం భద్రాద్రి జిల్లాలో వరి 1,61,257.24 ఎకరాల్లో, పత్తి 2,21,344.76 ఎకరాల్లో, మొక్కజొన్న 96,842 ఎకరాల్లో, కందులు 1,881ఎకరాల్లో సాగు చేశారు. రైతులకు అండగా నిలిచేలా పంట వైవిధ్యీకరణ, నీటిపారుదల, రైతుల సమిష్టీకరణకు మద్దతు అవసరం. ఇందులో భాగంగా జిల్లాను కేంద్రం అమలుచేస్తున్న ధన ధాన్య కృషి యోజన పథకం కింద చేరిస్తే రైతుల సంక్షేమంతోపాటు స్థానికంగా జీవనోపాధి మెరుగవుతుంది. దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో ఈ పథకం అమలు చేస్తున్నందున భద్రాద్రి జిల్లానూ చేర్చాలని వినతులు వెల్లువెత్తుతున్నాయి.

సర్వే సరే.. సాయమేదీ?
గత ఏడాది ఆగస్టు 31, సెప్టెంబర్ 1వ తేదీల్లో మున్నేరు వరదతో పరీవాహక ప్రాంతాలైన ఖమ్మం నగరం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లోని ప్రజలకు అపార నష్టం కలిగింది. అధికారులు చేపట్టిన సర్వేలో దాదాపు రూ.339 కోట్ల మేర నష్టం వాటిల్లిందని నిర్ధారించి కేంద్రానికి నివేదిక సమర్పించారు. ఆ తర్వాత ఢిల్లీ బృందం కూడా తమ పర్యటనలో ఇక్కడి పరిస్థితులు చూసి చలించిపోయారు. సాయం అందేలా సిఫారసు చేస్తామని బాధితులకు హామీ ఇచ్చినప్పటికీ ఏడాది దాటినా ఆ ఊసే లేదు.

డెడ్‌లైన్ పెట్టుకుంటేనే వేగం

- వచ్చే జూన్‌లోగా రిటైనింగ్ వాల్ పూర్తి
- కేబుల్ బ్రిడ్జి పనులపై ప్రత్యేక దృష్టి
- అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రతీ అభివృద్ధి పని పూర్తికి లక్ష్యం నిర్దేశించుకుని వేగం పెంచాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డితో కలసి మున్నేరు రిటైనింగ్ వాల్, కేబుల్ బ్రిడ్జి, ఖిలా రోప్‌వే పనుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మున్నేటి ముంపు నుంచి రక్షించేలా రూ.690 కోట్లతో ఇరువైపులా 17 కి.మీ. మేర నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ ఇప్పటికే 6.4 కి.మీ. పూర్తయిందని తెలిపారు. ఇంకా అవసరమైన భూసేకరణ చేపట్టి వచ్చే జూన్‌లోపే నిర్మాణం పూర్తిచేయాలని సూచించారు.

చకచకా కేబుల్ బ్రిడ్జి
కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని మంత్రి తెలిపారు. రూ.180 కోట్లతో చేపడుతున్న నిర్మాణం 53 శాతం పూర్తయిందని, వచ్చే మే నెలాఖరుకు అందుబాటులోకి రావాలని సూచించారు. అలాగే, ఖమ్మం ఖిలాపైకి రోప్ వే కోసం భూసేకరణ పూర్తికాగా, రూ.29 కోట్లతో చేపట్టే పనులు ప్రారంభించి వచ్చే జూలై నాటికి పూర్తి చేయాలన్నారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్
ఖమ్మం నగరం చుట్టూ హైవేల నిర్మాణంతో ట్రాఫిక్ ఇక్కట్లు తీరతాయని మంత్రి తుమ్మల తెలిపారు. ఖమ్మం–దేవరపల్లి జాతీయ రహదారిపై ధంసలాపురం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి, మున్నేటిపై బ్రిడ్జి పనులు జరుగుతున్నాయన్నారు. జనవరిలోగా అందుబాటులోకి వచ్చే ఈ హైవే పైనుంచే కోల్‌కతా, ఒడిశా, ఏపీలోని సగభాగం ప్రాంతాలకు ఖమ్మం మీదుగానే రాకపోకలు ఉంటాయన్నారు. అంతేకాక ఖమ్మం చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య ఉండదని చెప్పారు. ఆ తర్వాత అభివృద్ధి పనుల ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రి పరిశీలించారు. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈలు ఎం.వెంకటేశ్వర్లు, యాకోబ్, ఆర్డీఓ నర్సింహారావు, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తితో పాటు మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పెద్దాస్పత్రి కిటకిట


ఓపీ విభాగం వద్ద బారులు దీరిన జనం

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కిటకిటలాడింది. వరుసగా మూడు రోజుల సెలవులు రావడంతో సోమవారం వివిధ ప్రాంతాల ప్రజలు ఉదయం 8గంటల నుంచే క్యూ కట్టారు. దీంతో ఓపీ వద్ద భారీ క్యూలైన్ ఏర్పడగా చీటీ తీసుకునేందుకు గంటల సమయం పట్టింది. అలాగే, పలు విభాగాలు మధ్యాహ్నం వరకు కిక్కిరిసి కనిపించాయి. ఈక్రమాన కూర్చునే స్థలం లేక వృద్ధులు ఇబ్బంది పడ్డారు. ఇటీవల వర్షాలతో నీరు నిలిచి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతుండడంతో జిల్లా నలుమూలల నుండే కాకుండా చుట్టు పక్కల జిల్లాల జనం సైతం జిల్లా ఆస్పత్రికి వస్తున్నారు. సోమవారం ఒకేరోజు పెద్దాస్పత్రిలో 2,200 – 2,400 మంది వైద్య సేవలు పొందారని అధికారులు తెలిపారు.
– ఖమ్మంవైద్యవిభాగం

ఫిర్యాదులు పెండింగ్ ఉండొద్దు

గ్రీవెన్స్ డేలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణిలో ప్రజలు ఇచ్చే ఏ ఫిర్యాదును కూడా పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై పరిశీలన, పరిష్కారంపై సూచనలు చేశారు. డీఆర్వో పద్మశ్రీ, ఏఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా అమలు చేయాలి
ఖమ్మంవైద్యవిభాగం: స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన ఏర్పాటైన జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీతో కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17నుంచి అక్టోబర్ 2వరకు స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళలకు పరిశుభ్రత, పౌష్టికాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యాసంస్థల్లోనూ క్యాంపులు నిర్వహించిన అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేయాలన్నారు. డీఆర్‌ఓఏ పద్మశ్రీ, డీఎంహెచ్‌ఓ కళావతిబాయి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా 'నీలాద్రి' అభివృద్ధి

సీసీఎఫ్ భీమానాయక్


విద్యార్థులతో మాట్లాడుతున్న సీసీఎఫ్ భీమానాయక్, పక్కన డీఎఫ్‌ఓ సిద్ధార్థ్

సత్తుపల్లిటౌన్: మధ్యప్రదేశ్‌లోని భీమ్‌బెట్కా కొండల తరహాలో నీలాద్రి కొండలపై ప్రాచీన కాలం నాటి గుర్తులు ఉన్నందున పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అటవీ, దేవాదాయ శాఖల మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని సీసీఎఫ్ డాక్టర్ డి.భీమానాయక్ వెల్లడించారు. ఖమ్మం డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్‌తో కలిసి నీలాద్రి కొండపై సుమారు 5 కి.మీ. ట్రెక్కింగ్ చేశాక సత్తుపల్లి మండలం కిష్టారం సెక్షన్, చెరుకుపల్లి బీట్ నర్సరీలను పరిశీలించారు. మొక్కల సంరక్షణ, అటవీ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం చంద్రాయపాలెం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అంతేకాక వీఎస్ఎస్ సభ్యులతోనూ సమావేశమైన సీసీఎఫ్ మాట్లాడారు. నీలాద్రి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ఆర్కియాలజీ శాఖ ఆధ్వర్యాన పరిశోధన జరిపించనున్నట్లు చెప్పారు. వన సంరక్షణ సమితి సభ్యులకు అండగా నిలుస్తూ జీవనోపాధికి అవసరమైన ప్రోత్సాహం ఇస్తామని తెలిపారు. ఇదేసమయాన సభ్యులు అటవీ వనరులు, జీవవైవిధ్యం పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. కాగా, సత్తుపల్లి అర్బన్ పార్క్‌లో రూ.20లక్షలతో చేపడుతున్న యోగా షెడ్ నిర్మాణ పనులను డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ పరిశీలించారు. సత్తుపల్లి ఎఫ్‌డీఓ వాడపల్లి మంజుల, రేంజర్ స్నేహలతతో పాటు డీఆర్‌ఓలు, ఎఫ్ఎస్‌ఓలు పాల్గొన్నారు.

ఉద్యోగులదే విజయం!


ఉద్యోగ సంఘాల నాయకులకు ధ్రువపత్రం అందజేస్తున్న హౌసింగ్ అధికారులు

- 'రాజీవ్ స్వగృహ' దక్కడంపై హర్షం
- 576 ఫ్లాట్లకు రూ.87.41కోట్లతో బిడ్
- ఖరారు కావడంతో ఉద్యోగుల సంబురాలు

ఖమ్మం సహకారనగర్: ఎన్నో అడ్డంకులు, ఆటంకాలు, బిల్డర్ల నుంచి పోటీని తట్టుకుని రాజీవ్ స్వగృహ సముదాయాన్ని ఉద్యోగులు దక్కించుకున్నారు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలో రాజీవ్ స్వగృహ పేరిట అపార్ట్‌మెంట్లు ఏళ్ల క్రితం నిర్మించగా అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఈ బ్లాక్‌లను ఉన్నవి ఉన్నట్లు విక్రయించేందుకు ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించగా ఉద్యోగ సంఘాల ఆధ్వర్యాన కొనుగోలుకు సిద్ధమయ్యారు. తద్వారా సొంతింటి కల నెరవేరుతుందని భావించారు. ఇందుకోసం రూ.87.41కోట్లతో బిడ్ దాఖలు చేయగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సహకార గృహ నిర్మాణ సంఘానికి కేటాయించినట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ.గౌతమ్ సోమవారం ప్రకటించారు. సుమారు 9.22 ఎకరాల్లో 576 ఫ్లాట్లు ఉండగా, చదరపు అడుగుకు రూ.1,150 చొప్పున ధరతో బిడ్ దాఖలు చేశారు. తొలుత ఈనెల 6వ తేదీన ఉద్యోగ సంఘాల తరఫున రూ.5కోట్ల ధరావతు చెల్లించారు. అదేరోజు ఓ కాంట్రాక్టర్ కూడా దరఖాస్తు చేయడంతో మీమాంస నెలకొంది. కానీ సదరు కాంట్రాక్టర్ వెనక్కి తగ్గడంతో ఉద్యోగ సంఘాలకే దక్కినట్లయింది. ఈమేరకు సోమవారం రాజీవ్ స్వగృహ ప్రాజెక్ట్ సీఈ భాస్కర్‌రెడ్డి, ఈఈ నరేందర్‌రెడ్డి ధ్రువపత్రాన్ని ఉద్యోగ సంఘాల సొసైటీ బాధ్యులకు అందజేశారు. వచ్చే నెల 7వ తేదీలోగా రూ.17 కోట్లు చెల్లించాల్సి ఉండగా... మిగతా మొత్తాన్ని విడతల వారీ చెల్లించేలా నిబంధనల్లో పొందుపరిచారు.

ఆందోళన నుంచి ఆనందం
ఫ్లాట్లు అసంపూర్తిగా ఉండడంతో బిడ్‌లో గెలుచుకుని పూర్తిచేస్తామని ఉద్యోగ సంఘాల నాయకులు ప్రకటించారు. ఇందుకోసం నిర్ణీత ధరతో ఉద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా 250మందికి పైగా ముందుకొచ్చారు. ఈమేరకు ప్రైవేట్ అపార్ట్‌మెంట్లను పోలినట్లు బ్రోచర్లు ముద్రించగా కొత్త రూపులో ఉండడం.. మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణంతో ముంపు సమస్య ఉండదని భావించిన బిల్డర్లు కూడా ఇటుకన్నేశారు. దీంతో రాజీవ్ స్వగృహ సముదాయం దక్కుతుందా, లేదా అని ఉద్యోగులు ఆందోళనకు గురయ్యారు. రాష్ట్రస్థాయిలో ఉద్యోగ సంఘాల నాయకులు బిడ్ వేసిన కాంట్రాక్టర్‌తో చర్చించగా ఆయన ఉపసంహరించుకోవడంతో సముదాయం ఉద్యోగుల వశమైనట్లయింది. దీంతో సోమవారం స్వగృహ వద్ద బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజీవ్ స్వగృహ విషయంలో సహకరించిన వ్యాపారవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సహకారంతోనే రాజీవ్ స్వగృహ దక్కించుకున్నామని.. తద్వారా ఉద్యోగుల సొంతింటి కల నెరవేరుతోందని చెప్పారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు మధ్య తరగతి ఉద్యోగుల సొంత ఇంటి కలలను నెరవేరుస్తుందని తెలిపారు. హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా కిషోర్, ఈట విజయ్‌కుమార్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టీజీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, వేలాద్రితో పాటు వెంకన్న, జైపాల్, గంగవరపు బాలకృష్ణ, మల్లెల రవీంద్రప్రసాద్, ప్రభాకరాచారి, లలిత కుమారి, మృదుల, ఆంజనేయులు, సుధాకర్, రుక్మారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఇలా
పోలెపల్లిలోని 9.22 ఎకరాల్లో ఎనిమిది టవర్లుగా ఈ సముదాయం నిర్మాణాన్ని చేపట్టారు. ఇక్కడ ఎనిమిది బ్లాక్‌ల్లో తొమ్మిది అంతస్తులుగా 576 ఫ్లాట్లు నిర్మించారు. చదరపు అడుగుకు ప్రభుత్వానికి రూ.1,150 చెల్లించాల్సి ఉండగా, రూ.2,500 చొప్పున తీసుకుని నిర్మాణం పూర్తిచేసి కేటాయిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గెజిటెడ్, నాన్–గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు వీటిని కేటాయించాలని ప్రతిపాదించారు. అంతేకాక ఈ సముదాయంలో క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మించేలా డిజైన్లు సిద్ధం చేశారు.

అవార్డుల కోసం తప్పుడు సమాచారం

హెచ్‌ఎంపై చర్యలకు రంగం సిద్ధం

వైరారూరల్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇచ్చే అవార్డుల కోసం ఒక హెచ్‌ఎం తప్పుడు సమాచారం అందజేసిన విషయం బయటపడింది. గతంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన మండలంలోని గరికపాడు జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం దొంతెబోయిన సత్యనారాయణ ఈ చర్యకు పాల్పడగా అధికారులు విచారణ చేపట్టారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో గత విద్యాసంవత్సరం ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలలనుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈక్రమాన గరికపాడు జెడ్పీహెచ్ఎస్‌లో సాంఘిక శాస్త్రం తప్ప తెలుగు, హిందీ, ఆంగ్లం, సైన్స్, గణితంలో తమ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు హెచ్‌ఎం సత్యనారాయణ ఎంఈఓకు తప్పుడు నివేదిక సమర్పించారు. ఆపై మండల వ్యాప్తంగా నివేదికలు అదనపు కలెక్టర్, డీఈఓ శ్రీజ వద్దకు వెళ్లగా ఆమె అనుమానంతో విచారణకు ఆదేశించారు. ఈక్రమాన సత్యనారాయణ ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు నివేదిక ఇచ్చినట్లు గుర్తించగా ఆయనపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లును వివరణగా సాంఘికశాస్త్రం తప్ప అన్ని సబ్జెక్టుల్లో గరికపాడు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు హెచ్‌ఎం సత్యనారాయణ తప్పుడు నివేదిక ఇచ్చిన విషయం వాస్తవమేనని ధ్రువీకరించారు.

క్లుప్తంగా

డిప్యూటీ సీఎం సమక్షాన కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం భట్టి

బోనకల్: బోనకల్‌లో బీఆర్‌ఎస్‌కు చెందిన 70 కుటుంబాలు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సమక్షాన కాంగ్రెస్‌లో చేరాయి. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం వీరికి భట్టి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువు రు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్, సొసైటీ అధ్యక్షు డు చావా వెంకటేశ్వరావుతో పాటు పోటు వెంకటేశ్వర్లు, మందా హైమావతి, మోర్ల మహేశ్వరావు, మంద రమణ, టేకులపల్లి సాంబయ్య, మరీదు నరసింహారావు తదితరులు ఉండగా మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరావు, నా యకులు బందం శ్రీను, పైడిపల్లి కిశోర్, గాలి దుర్గారావు, పిల్లలమర్రి నాగేశ్వరావు, సుబ్బారావు, భద్రూనాయక్ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

ఖమ్మం రాపర్తినగర్: రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో నియామకాలకు ఈనెల 10వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టులకు 18–45 ఏళ్ల వయస్సు కలిగిన అర్హులని వెల్లడించారు. అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఖమ్మం గాంధీచౌక్‌లోని రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

నేడు వాహనాల వేలం

ఖమ్మంక్రైం: వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఆటోలు, ద్విచక్ర వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఖమ్మంలోని ఎక్సైజ్ స్టేషన్–1 ఆవరణలో ఉదయం 11గంటలకు వేలం మొదలవుతుందని, ఆసక్తి ఉన్న వారు ధరావత్తు రుసుము చెల్లించి పాల్గొనాలని సూచించారు. వాహనం దక్కించుకుంటే మొత్తం సొమ్మును జీఎస్‌టీతో సహా వెంటనే చెల్లించాల్సి ఉంటుందని, లేనిపక్షంలో ధరావత్తు జప్తు చేస్తామని తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ టోర్నీలో సత్తా



టోనిశ్రీతో కార్పొరేటర్, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్/ఖమ్మంఅర్బన్: ఖేలో ఇండియా లీగ్ పోటీల్లో భాగంగా రాష్ట్రస్థాయిలో జరిగిన మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఖమ్మంకు చెందిన ఎ.టోనిశ్రీ ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం దక్కించుకుంది. మహిళల 53 కేజీల కేటగిరీలో పాల్గొన్న ఆమె స్నాచ్‌లో 53, క్లీన్ అండ్ జర్క్‌లో 65 కేజీలు కలిపి 118 కేజీల బరువు ఎత్తడంతో ప్రథమస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన టోనిశ్రీని వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివ గణేష్, డి.వినోద్‌కుమార్, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణతో పాటు బాజిని వీరయ్య, తిరుపతిరావు, వినోద్‌కుమార్, నాగరాజు, సిద్ధార్థ, ప్రశాంత్, విప్లవ్, ఉదయ్, సుమతి తదితరులు అభినందించారు.

పట్టు పురుగుల పెంపకం పరిశీలన



మల్బరీ తోటను పరిశీలిస్తున్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: వైరా మండలం గొల్లపూడి, రెబ్బవరం గ్రామాల 30 మంది రైతులు విజ్ఞాన యాత్రలో భాగంగా సోమవారం మెదక్ జిల్లా తలకొండపల్లి మండలం కోరింతకుంటలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో పలువురు రైతుల పట్టు పురుగుల కేంద్రాలను పరిశీలించారు. రేరింగ్ షెడ్, మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పట్టు పరిశ్రమ ఉప సంచాలకులు ముత్యాలు, అధికారులు, రైతులు కామేశ్వర రావు, దేవరాజు, ఎం.లాల్, రవీందర్, రమేష్, శంకర్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,250	3,000
కందులు	6,000	6,000
ఏసీ మిర్చి	15,400	8,000
మిర్చి	8,500	7,000
పత్తి	7,500	6,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,107

తెలంగాణ తెలుగు.. వెలుగు!

- ప్రత్యేక రాష్ట్రంలో భాషకు ప్రాధాన్యత
- ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకంగా సమ్మిళిత మాండలికం

నేడు తెలంగాణా భాషా దినోత్సవం



ఖమ్మంగాంధీచౌక్: భాషా చైతన్యాన్ని ప్రోత్సహించడం, పెంపొందించడమే లక్ష్యంగా ప్రాంతాలు, ప్రాంతీయత వారీగా భాషా దినోత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే తెలంగాణ ఏర్పడ్డాక 2014 నుంచి ఏటా తెలంగాణ భాషా దినోత్సవాన్ని సెప్టెంబర్ 9న నిర్వహిస్తున్నారు. ప్రముఖ రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఈ తేదీని ఖరారు చేశారు. ఈమేరకు నేడు(మంగళవారం) తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా కథనం.

అంతులేని ప్రేమ

'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి, అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించినోడే నాకు ఆరాధ్యుడు' అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు. అందుకే ఆయనను తెలంగాణ తొలిపొద్దుగా కీర్తిస్తారు. తెలంగాణ భాషపై అంతులేని ప్రేమ కనబరిచిన ఆయన పండితుల భాషలో కాకుండా సామాన్యుల భాషలోనే రచనలు చేశారు. ఫలితంగా జనం గోడుకు ఆయన కలం గొంతుకగా మారింది.

మాండలికాలు వేరు

తెలుగు భాష ఒక్కటే అయినా మాండలికాలు అనేకం ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణ భాషలో వ్యత్యాసాలు కనిపిస్తాయి. నిజాం పాలనలో ఉర్దూ కలగలిసిన తెలంగాణ ప్రజల యాసను కొందరు గేలి చేసేవారు. దీన్ని తెలంగాణ సాహితీవేత్తలు తీవ్రంగా విమర్శించగా.. అందులో అగ్రభాగాన కాళోజీ నిలిచారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన తెలుగు భాష, తెలంగాణ యాసపై తనదైన ముద్ర వేశారు. కాగా, తెలుగు భాషలో తెలంగాణ యాస ప్రత్యేకంగా నిలుస్తుండగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక మరింత ప్రాధాన్యత పెరిగింది. ఈ యాసకు ఉన్న ప్రత్యేక శైలితో ప్రాచుర్యం పొందింది. నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమైనా, ప్రత్యేక తెలంగాణ పోరాటమైనా ప్రజలను మేల్కొల్పింది, కదన రంగంలోకి దూకించింది తెలంగాణ భాషే అన్నది సుస్పష్టం. ఇక సినిమాల్లోనూ ఈ యాసకు ప్రత్యేక గుర్తింపు లభిస్తోంది. పలువురు నటులు ఈ యాసలో డైలాగ్‌లతో సినిమాలను రక్తి కట్టించారు.

ఇక్కడ రెండు యాసలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తెలుగు భాష, యాస సమ్మిళితంగా ఉంటుంది. ఈ ప్రాంతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరిహద్దుగా ఉండడంతో రాకపోకలు పెరగడంతో ప్రజల మాటల్లో యాస కలగలిపి కనిపిస్తుంది. ఇదే సమయాన సింగరేణి, తదితర పరిశ్రమల్లో పనిచేసేందుకు ఉత్తర తెలంగాణ వేలాది మంది వచ్చి ఇక్కడ స్థిరపడడంతో తెలంగాణ యాసకు ఏ మాత్రం ప్రాధాన్యత తగ్గలేదు.

యాసలు కలిసిన భాష తెలుగు



తెలుగు భాషలో అనేక యాసలు ఉన్నాయి. ఇందులో తెలంగాణ యాసకు ప్రత్యేకత ఉంది. జిల్లా కవి చందాల కేశవదాసు సినిమా పాటల కవిగా నిలిచారు. హీరాలాల్, దాశరథి సోదరులు, కౌముది, షోయబుల్లాఖాన్. ఎందరో భాషాభ్యున్నతికి కృషి చేశారు.– **పొన్నెకంటి స్వప్న, తెలుగు అధ్యాపకురాలు**

భాషా సౌరభం వ్యాప్తి



తెలంగాణ భాషా సౌరభం ఉమ్మడి జిల్లాలో వ్యాప్తి చెందింది. రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ యాస, మాండలికంలో పుస్తకాలు వచ్చాయి. పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పరిచయం చేయడం ఆనందంగా ఉంది. ప్రధానంగా కాళోజీ రచనలు ఆదర్శప్రాయం. – **సయ్యద్ షఫీ, తెలుగు ఉపాధ్యాయుడు**

మాండలికాల సమ్మేళనం



జిల్లా ఆంధ్రా – తెలంగాణ మధ్య వారధిగా రెండు మాండలికాల సమ్మేళనంగా నిలుస్తోంది. పద బంధాలు వేరైనా యాసలు విరాజిల్లుతున్నాయి. అన్ని మార్పులను తట్టుకుని 'కాళన్న' కోరుకున్న తెలంగాణ భాష జవసత్వాలను కాపాడుకుంటోంది.

– **అట్లూరి వెంకటరమణ, కవి, రచయిత**

యాసకు ఊపిరి..



ఉమ్మడి జిల్లాలో తెలంగాణ, ఆంధ్ర తెలుగు భాషల కలగలిపి ఉంటుంది. పొరుగున ఉన్న ఏపీ వారు ఎందరో ఇక్కడ స్థిరపడ్డారు. ఏళ్లుగా స్థిరనివాసం ఏర్పర్చుకోగా వారి యాస, ఇక్కడి యాసకు తేడా ఉన్నా క్రమంగా తెలంగాణ యాసే వినబడుతుంది.

– **గాజుల భారతి శ్రీనివాస్, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు**

వినసొంపైన భాష



తెలుగు భాషలో నాలుగు మాండలికాలు ఉన్నాయి. వచ్చిండు, వచ్చాడు, వచ్చినాడు.. ఇలా యాస ఏదైనా తెలుగు వినసొంపుగానే ఉంటుంది. మన జిల్లాలో ఆంధ్ర, తెలంగాణ యాస సమ్మిళితంగా ఉంటుంది. తద్వారా కొత్త పదబంధాలు ఏర్పడుతుంటాయి.

– **కొండ్రు బ్రహ్మం, తెలుగు ఉపాధ్యాయుడు**

తీరని యూరియా కష్టాలు



నేలకొండపల్లి : సొమ్మసిల్లిన మల్లమ్మను తీసుకెళ్తున్న రైతులు



కూసుమంచి : గట్టుసింగారంలో బారులు దీరిన రైతులు



బోనకల్ : మోటమర్రిలో తలుపులు తీయకముందే పడిగాపులు కాస్తున్న అన్నదాతలు

నేలకొండపల్లి/బోనకల్/కూసుమంచి: రోజులు గడుస్తున్నా యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు తీరడం లేదు. నేలకొండపల్లి రైతు వేదిక వద్ద సోమవారం సొసైటీ ఆధ్వర్యాన యూరియా పంపిణీ చేయడంతో రైతులు భారీగా వచ్చారు. పట్టాదారు పాసు పుస్తకాలు జిరాక్స్‌లను క్యూలో పెట్టగా.. ఏఓ ఎం.రాధ కూపన్లు జారీ మొదలుపెట్టారు. ఇంతలోనే తోపులాట జరగడంతో మహిళా రైతు కె.మల్లమ్మకు ఊపిరాడక సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఆపై గ్రామాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేసి, స్టాక్ ఉన్న యూరియాకు తోడు త్వరలో వచ్చే స్టాక్‌కు కూడా కూపన్లు జారీ చేశారు. ఇక బోనకల్ మండలం మోటమర్రి పీఏసీఎస్‌లో 230 బస్తాల యూరియా రాగా, 400 మంది రైతులు కేంద్రం తెరవక ముందే చేరుకున్నారు. దీంతో ఒక్కొక్కరికి ఒకే బస్తా ఇచ్చినా చాలా మంది నిరాశగా వెనుదిరిగారు. కాగా, కూసుమంచి మండలంలోని కల్లూరుగూడెం, చేగొమ్మ, జక్కేపల్లి పీఏసీఎస్‌లతో పాటు 14 సబ్‌సెంటర్ల ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. ఒక్కో సెంటర్‌కు 110 బస్తాలే కేటాయించడంతో పెద్దసంఖ్యలో రైతులు చేరుకోగా పట్టాదారు పాసుపుస్తకాల ఆధారంగా పోలీసు బందోబస్తు నడుమ కూపన్లు జారీ చేసి యూరియా పంపిణీ చేశారు. ఈక్రమాన తోపులాట జరిగింది. తహసీల్దార్ రవికుమార్, ఏడీఏ సతీష్, ఎంపీడీఓ రాంచందర్‌రావు, ఏఓ వాణి తదితరులు పర్యవేక్షించారు.

రైతులు ఇబ్బంది పడొద్దని అదనపు కౌంటర్లు



యూరియా పంపిణీని పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

కామేపల్లి: రైతులు యూరియా కోసం ఇబ్బంది పడకుండా రైతు వేదికల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య తెలిపారు. కామేపల్లి మండలం పొన్నేకల్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన సేల్ కౌంటర్లను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అయితే, రైతులు పరిమితి మేరకే యూరియాను దఫాదఫాలుగా వాడాలని సూచించారు. ఇదే సమయాన నానో యూరియా, నానో డీఏపీపై లాభాలను గ్రహించాలని తెలిపారు. అలాగే, కొండాయిగూడెం సొసైటీలో యూరియా పంపిణీని ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు పరిశీలించారు. కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, సీఈఓ దొడ్డా ముత్తయ్య, ఏఓ తారాదేవి, ఏఈఓలు ఉష, శ్రీకన్య, దీపక్‌రెడ్డి, జగదీశ్వర్, భాస్కర్, రవికుమార్, గాదె నాగయ్య పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల పంపిణీ

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంవ్యవసాయం: 'సాగు యంత్రాలు అందించండి' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. యంత్ర పరికరాలకు నిధులు మంజూరైనా పథకం అమలులో కాలయాపనతో రైతులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని కథనంలో వెల్లడించగా అధికారులు రంగంలోకి దిగారు. యంత్ర పరికరాల పంపిణీ కోసం కలెక్టర్ అనుమతి తీసుకున్నారు. సన్న, చిన్నకారు ఎస్సీ, ఎస్టీ, ఇతర రైతులకు 50 శాతం, పెద్ద రైతులకు 40 శాతం సబ్సిడీపై యంత్రాలు అందించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు.

ఇవీ మార్గదర్శకాలు

స్ప్రేయర్లు, రోటోవేటర్లు, పవర్ టిల్లర్లు, గడ్డి కట్టే తదితర యంత్రాలు అందించనుండగా, జిల్లాకు రూ.4,37,97,000 నిధులను ప్రభుత్వం కేటాయించిందని డీఏఓ పేర్కొన్నారు. కలెక్టర్ అనుమతితో నియోజకవర్గాల వారీగా కేటాయించిన బడ్జెట్ ఆధారంగా పనిముట్ల పంపిణీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనుండగా, రైతులు ఏఈఓలు, ఏఓలను సంప్రదించాలని సూచించారు. పథకం అమలుకు మండల స్థాయిలో ఏర్పాటుచేసిన కమిటీకి కన్వీనర్‌గా మండల వ్యవసాయాధికారి, సభ్యులుగా తహసీల్దార్, ఎంపీడీఓ వ్యవహరిస్తారని తెలిపారు. ఇక జిల్లా కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, కన్వీనర్‌గా జిల్లా వ్యవసాయాధికారి, సభ్యులుగా ఆగ్రోస్ రీజినల్ మేనేజర్, డాట్ సైంటిస్ట్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉంటారని చెప్పారు. బ్యాటరీ చేతిపంపులపై రూ.వేయి, పవర్ స్ప్రేయర్లకు రూ.10వేలు, రోటోవేటర్‌కు రూ.50వేలు, విత్తన, ఎరువులు వేసే యంత్రానికి రూ.30వేలు, కల్టివేటర్లు, ఎంబీ ప్లౌ, దమ్ము చక్రాలు, డిస్క్ హారోలకు రూ.30వేలు, బండ్ ఫార్మర్‌కు రూ.1.50లక్షలు, పవర్ వీడర్, బ్రష్ కట్టర్లకు రూ.35వేలు, పవర్ టిల్లర్‌కు రూ.లక్ష, మొక్కజొన్న కోత యంత్రాలు, గడ్డికట్టే యంత్రాలకురూ.రూ.లక్ష సబ్సిడీ ఉంటుందని డీఏఓ పుల్లయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

సుర్రుమంటున్న ఎండలు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో ఎండ తీవ్రత సోమవారం పెరిగింది. సోమవారం అధికంగా 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. గత శుక్రవారం 34 డిగ్రీలు ఉండగా, శనివారం 32 డిగ్రీలకు పడిపోయింది. ఇక ఆదివారం జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసింది. కానీ సోమవారం ఒక్కసారిగా ఎండ పెరగడం గమనార్హం. ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో అత్యధికంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఎర్రుపాలెంలో 37.9, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 37.8, వైరాలో 37.7, తల్లాడ, కుర్నవల్లి, వైరా ఏఆర్‌ఎస్‌లో 37.4, గంగారం, బచ్చోడులలో 37.2, సత్తుపల్లి ఓసీ వద్ద 37.1డిగ్రీలుగా నమోదైంది. ఎండ తీవ్రతకు తోడు ఉక్కపోతతో జనం ఇబ్బంది పడ్డారు.

కార్గో డెలివరీ పాయింట్ దారి మూసివేత

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మం కొత్త బస్టాండ్‌లోని కార్గో డెలివరీ పాయింట్‌కు వెళ్లే దారిని మూసివేశారు. దీంతో ప్రయాణికులు, పార్సిళ్లు తీసుకునేందుకు వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు. ఆ మార్గంలో ఎవరూ వెళ్లకుండా తాడు కట్టారు. ఆ పక్కన నుంచే వెళ్దామంటే చిన్న సందే ఉండడం అక్కడ ఆటోలు నిలుపుతుండడంతో సమస్య ఎదురవుతోంది.



తాడు దాటేందుకు యత్నిస్తున్న యువకుడు

పత్తి దిగుమతిపై సుంకం రద్దు సరికాదు..



సమావేశంలో పాల్గొన్న సంఘాల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతిపై 11 శాతం సుంకాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయని వామపక్ష రైతు సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్రం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వివిధ సంఘాల నాయకులు మలీదు నాగేశ్వరరావు, కొల్లేటి నాగేశ్వరరావు, దొండపాటి రమేష్, మాదినేని రమేష్ మాట్లాడారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఈనెల 10న ఖమ్మంలో రైతాంగ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసదస్సులో రైతులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కాగా, రైతాంగానికి సరిపడా యూరియాను కేంద్రం సరఫరా చేయాలని, రాష్ట్రంలో నష్టపోయిన పంటలపై సర్వే చేయించాలని డిమాండ్ చేశారు.

2,250 ఎకరాల్లో బొప్పాయి సాగు



బొప్పాయి తోటలో పరిశీలిస్తున్న మధుసూదన్

కామేపల్లి: ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 2,250 ఎకరాల్లో బొప్పాయి పంట సాగవుతోందని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ తెలిపారు. వైరా డివిజన్ ఉద్యాన అధికారి ఆకుల వేణుతో కలిసి ఆయన సోమవారం మండలంలో పర్యటించారు. తాళ్లగూడెం తదితర గ్రామాల్లో సాగవుతున్న బొప్పాయి పంటను పరిశీలించి చీడపీడల నివారణపై సూచనలు చేశారు.

బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా వాసుదేవరావు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ రాష్ట్ర నూతన కమిటీని సోమవారం ప్రకటించగా ఖమ్మంకు చెందిన నాయకుడు దేవకి వాసుదేవరావుకు స్థానం దక్కింది. ఆయనను రాష్ట్ర కోశాధికారిగా నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తదితరులు వాసుదేవరావును అభినందించారు.

సదరమ్ విభాగంలో ఉద్యోగుల తొలగింపు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సదరమ్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులపై ఆరోపణలు రావటంతో తొలగించారు. పెద్దాస్పత్రిలో సదరమ్ క్యాంపుల నిర్వహణ సందర్భంగా దివ్యాంగులకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై 4వ తేదీన వరంగల్ క్రాస్ రోడ్డుకు చెందిన వ్యక్తి ఫిర్యాదు చేయగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ విచారణ చేపట్టారు. సదరు వ్యక్తి సర్టిఫికెట్ రెన్యూవల్ కోసం సిబ్బంది రూ.25వేలు డిమాండ్ చేసినట్లు రుజువైంది. దీంతో డీఆర్‌డీఓ సన్యాసయ్య దృష్టికి తీసుకెళ్లగా సదరమ్ విభాగంలోని ఇద్దరు ఇద్దరు ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో మరో ఇద్దరిని నియమించారు.

రెక్కీ చేసి.. సొత్తు ఎత్తుకెళ్తూ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమణమూర్తి

- అంతర్ జిల్లా దొంగలు అరెస్ట్
- రూ.16లక్షల విలువైన సొత్తు స్వాధీనం

ఖమ్మంక్రైం: జిల్లాలో వివిధ ప్రాంతాలతోపాటు ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్, అర్బన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వివరాలను సోమవారం నగర ఏసీపీ రమణమూర్తి వెల్లడించారు. ఖమ్మం ముస్తఫానగర్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ చోరీలకు పాల్పడుతున్న పాతనేరసుస్తుడు చల్లా వెంకటేశ్వర్లు, భద్రాచలం శ్రీరామ్‌నగర్‌కు చెందిన దేవనబోయిన మహేష్ అలియాస్ బాతు పలు ప్రాంతాల్లో తిరుగుతూ తాళాలు వేసి ఇళ్లను గుర్తించేవారు. ఆపై రాత్రివేళ చోరీ చేసి ఆ డబ్బుతో మూడు ద్విచక్రవాహనాలు కొనుగోలు చేశారు. వీటిపై తిరుగుతూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఖమ్మం నగరంతోపాటు, ఖమ్మం రూరల్, బోనకల్, కామేపల్లి, వేంసూరు, ఏన్కూరు, సత్తుపల్లి, కొత్తగూడెం ప్రాంతాల్లో చోరీ చేయగా, చల్లా వెంకటేశ్వర్లుపై గతంలోనే 15చోరీ కేసులు ఉన్నాయి. జైలు నుంచి విడుదలైనా తీరు మారకపోగా బట్టల షాపులో పనిచేసే మహేష్‌తో కలిసి చోరీలు మొదలుపెట్టాడు. ఖమ్మం నూతన బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనం వెళ్తున్న వీరిని అదుపులోకి తీసుకోవడం చోరీల విషయం బయటపడింది. దీంతో నిందితుల నుంచి రూ.13లక్షల విలువైన 127గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండితో పాటు టీవీ, సౌండ్ బాక్స్, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

తప్పుడు సమాచారంతో ఇక్కట్లు

సొత్తు పోగొట్టుకోన్న వారిలో కొందరు అబద్ధపు వివరాలతో ఫిర్యాదు చేస్తున్నారని ఏసీపీ రమణమూర్తి తెలిపారు. రెండు తులాల ఆభరణాలు పది తులాలని, రోల్డ్‌గోల్డ్ నగలు పోతే నిజమైన నగలుగా ఫిర్యాదు చేస్తుండడంతో రికవరీలో ఇబ్బంది అవుతోందని పేర్కొన్నారు. కాగా, చోరీ అయిన సమయాన ఫిర్యాదు చేసేవారు ఇక నుంచి బిల్లులు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో అపార్ట్‌మెంట్లలో చోరీచేసిన మధ్యప్రదేశ్‌కు చెందిన ధార్ ముఠాను గుర్తించామని, త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామని చెప్పారు. కొన్ని అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్లు లేకపోగా, ఉన్న చోట నిద్రిస్తుండడంతో దొంగలకు పని సులువవుతోందని తెలిపారు. ఈ సమావేశంలో సీసీఎస్ ఏసీపీ సర్వర్, సీఐలు కరుణాకర్, బాలకృష్ణ, భానుప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఐదేళ్ల జైలుశిక్ష

ఖమ్మం లీగల్/కొణిజర్ల: ఓ మహిళను కులం పేరుతో దూషించిన కొణిజర్ల మండలం గుబ్బగుర్తికి చెందిన బచ్చు హుస్సేన్‌కు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.9,500 జరిమానా విధిస్తూ ఖమ్మం ఎస్సీ, ఎస్టీ కోర్టు జిల్లా న్యాయాధికారి డి.రాంప్రసాద్ సోమవారం తీర్పు చెప్పారు. ఈ తీర్పు వివరాలను వైరా ఏసీపీ ఎం.ఏ.రహమాన్ వెల్లడించారు. హుస్సేన్ ఆటోలో 2019 జనవరి 23న గ్రామానికి చెందిన మహిళ ఖమ్మం నుంచి గుబ్బగుర్తికి వచ్చింది. ఆటోలో సామగ్రి మరిచిపోయానని హుస్సేన్ ఇంటికి వెళ్లి అడగగా కులం పేరుతో దూషించాడని ఆమె కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణ అనంతరం హుస్సేన్‌కు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ బి.కృష్ణమోహన్ వాదించగా, వైరా గత, ప్రస్తుత ఏసీపీలు ప్రసన్నకుమార్, రెహమాన్ విచారించారు. వీరితో పాటు కేసు విచారణలో పాల్గొన్న ఎస్సై శ్రీకాంత్, ఉద్యోగులు మల్లికార్జున్, నాగేశ్వరావు, పాషాను సీపీ సునీల్‌దత్ అభినందించారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది..

ఖమ్మం లీగల్: అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో ఖమ్మం జూబ్లీపురకు చెందిన పుచ్చకాయల లింగరాజుకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మం చైతన్యనగర్‌కు చెందిన పోలిశెట్టి రాంబాబు వద్ద లింగరాజు 2016 ఏప్రిల్ 23లోరూ.5 లక్షలు రుణం తీసుకున్నాడు. ఆపై 2019 అక్టోబర్‌లో రూ.8.70 లక్షలకు చెక్కు జారీ చేసినా ఆయన ఖాతాలో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసిన రాంబాబు కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం లింగరాజుకు జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.8.70లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

దృష్టి ఏమార్చి సెల్‌ఫోన్ చోరీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం శ్రీనగర్ కాలనీ 16వ లేన్‌లో ఓ వ్యక్తి దృష్టి మరల్చిన నిందితులు సెల్‌ఫోన్ చోరీ చేశారు. అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే కోటిరెడ్డి సోమవారం తన బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై ఇద్దరు వచ్చారు. ఆయన దగ్గరకు రాగానే బైక్ ఆపి సమస్య ఎదురైందని చెప్పడంతో కోటిరెడ్డి దిగి చూస్తుండగా ఆయన చొక్కా జేబులోని ఫోన్ లాక్కుని పారిపోయారు. ఘటనపై బాధితుడు ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.